వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం18 అక్టోబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 106

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

దుర్గాపూజ మండపంలో తొక్కిసలాట

17 మంది మృతి

ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి

కోల్‌కతా, అక్టోబర్ 17 : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో సామూహిక దుర్గాపూజలో అపశ్రుతి చోటుచేసుకుంది. మండపం వద్ద జనం ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట తరహా పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో 17 మంది మృతి చెందినట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఘటనలో మరో 25 మంది గాయపడ్డారు. బాధితుల్లో ఎక్కువగా మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. నగరంలోని చోర్‌బగాన్ దుర్గాపూజ మండపం బయట వేచి ఉన్న జనం ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లారు. వర్షం కురుస్తున్న సమయంలో తోపులాట జరిగిందని, కొందరు రోడ్డుపై పడిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సీఎం సువేందు అధికారి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి

మూడు దశల్లో భూముల రీ సర్వే

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

సర్వే కోసం మరో 400 రోవర్ల కొనుగోలు

వచ్చేనెల చివరి నాటికి మొదటి దశ పూర్తి

ఇప్పటికే సర్వే పూర్తయిన 285 గ్రామాల్లో అభ్యంతరాల స్వీకరణ

పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూధార్ పట్టాల పంపిణీ

సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించి.. ప్రతి కమతానికీ హద్దులు నిర్ణయించి యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివ్షసరెడ్డి అన్నారు. ఇప్పటికే 285 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు చేసినట్లు వెల్లడించారు.

హైదరాబాద్, అక్టోబర్ 17 : రాష్ట్రంలో అన్ని రకాల భూముల సమగ్ర రీసర్వేను మూడు దశల్లో పూర్తి చేయనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే ఈ సర్వే ప్రధాన లక్ష్యమన్నారు. మొదటి దశలో భాగంగా ఇప్పటికే కొనసాగుతున్న సర్వేను వచ్చేనెలాఖరుకు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు.

-మిగతా 2 లో..

315 మండలాల్లో కరువు

తక్షణ సాయం అందించండి

కేంద్ర మంత్రి శివరాజ్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి..

హైదరాబాద్, అక్టోబరు 17 : ఎల్‌నినో కారణంగా తెలంగాణలోని 315 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, కేంద్రం తక్షణమే సాయం అందించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శివరాజ్‌సింగ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణలో ఖేత్ బచావో కార్యక్రమాన్ని అక్టోబరు 22 నుంచి నవంబరు 30 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఎరువుల ధరలు, రాయితీలను హేతబద్ధీకరించాలని, ప్రధాన పంటలకు పరిమితి లేకుండా 100 శాతం కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. అలాగే వీబీజీరామ్‌జీ పథకం కింద నిధుల కేటాయింపును పెంచాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భూసేకరణ ప్రధాన సమస్యగా మారడంతో.. పంపిణీ కాలువను సాధ్యమైన చోట్ల

-మిగతా 2 లో..

తెలంగాణపై భారీ కుట్ర

గోదావరి-కావేరి లింకు ముసుగులో తెలంగాణ నీటి హక్కులకు మరణశాసనం

గురువుకు రేవంత్ దాసోహం.. దన్నుగా కేంద్రం

ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశ ఎజెండాగా జీసీ లింకు

కృష్ణానదీ జలాల్లోనూ రాష్ట్రానికి తీరని అన్యాయం

కాంగ్రెస్ నిర్వాకంతో మన ప్రాజెక్టులకు ముప్పు

బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 17 :గోదావరి–కావేరి నదుల అనుసంధానం పేరిట తెలంగాణపై భారీ కుట్ర జరుగుతోందని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఈ రెండు నదుల అనుసంధానాన్ని పోలవరం నుంచి చేపట్టాలని కోరుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 7న లేఖ రాశారని, దాన్ని పరిగణనలోకి తీసుకొని నవంబరు 3న దిల్లీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశానికి ఏర్పాట్లు చేసిందని ఆయన తెలిపారు. గోదావరి–కావేరి లింక్‌ను సమావేశ ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు సమాచారాన్ని కూడా పంపిందన్నారు. తెలంగాణ నీటి హక్కులపై ఇంత పెద్ద కుట్ర జరుగుతుంటే అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. "గోదావరి జలాలను అక్రమంగా తరలించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్నారు. భారాస అధికారంలో ఉన్నన్ని రోజులూ వాటిని అడ్డుకున్నాం. గోదావరిలో 200 టీఎంసీలు తీసుకుపోయేందుకు

మిగతా 2 లో

నేడు.. రేపు మోస్తరు వర్షాలు

పలు జిల్లాల్లో కురిసిన వర్షం

హైదరాబాద్, అక్టోబర్ 17 :రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల పరిధిలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. మంగళ, బుధవారాల్లోనూ పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా ఉపరితల ఆవర్తనం, దక్షిణ కోస్తాంధ్ర నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు ఏర్పడిన ద్రోణి కారణంగా వర్షాలు కురిసే వీలుందని పేర్కొంది. మరోవైపు శనివారం భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి తదితర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

ఇంటర్నెట్.. పిల్లల ప్రాథమిక హక్కు

ఆన్‌లైన్ ముప్పు పేరుతో నిరాకరించలేం

జ్ఞాన సముపార్జన, విద్యాభివృద్ధికి అత్యవసరం

డిజిటల్ ప్రపంచానికి వారిని దూరం చేయడం తగదు

స్పష్టం చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం

ఇంటర్నెట్‌ను ఉపయోగించుకోవడం పిల్లల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. వారికి ఇంటర్నెట్ సేవలను దూరం చేయడం సరికాదని స్పష్టంచేసింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ నెల 15న విచారణ చేపట్టింది. నేటి డిజిటల్ యుగంలో విద్య, విజ్ఞాన సముపార్జనకు ఇంటర్నెట్ అత్యంత కీలక సాధనమని గుర్తుచేసింది. ఈ విషయంలో గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావించింది.

న్యూఢిల్లీ, అక్టోబరు 17 : నూతన ఆలోచనలు, సృజనాత్మక వ్యక్తీకరణకు, సమాచారం పొందడానికి ఇంటర్నెట్ అత్యవసరమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఇంటర్నెట్‌ను పొందే, ఉపయోగించుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని వెల్లడించింది. అది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని చెప్పడానికి తమకు ఎలాంటి సంకోచం లేదని తెలియజేసింది. మన పిల్లలు

మిగతా 2 లో

2లో..

అంబర్‌పేటలో కన్నులపండువగా బతుకమ్మ సంబరాలు!

72 అడుగుల భారీ బతుకమ్మతో సరికొత్త రికార్డు!

అంబర్‌పేట్ బతుకమ్మకు ఘనమైన గుర్తింపు

'యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బతుకమ్మ ఉత్సవాలు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు. అంబర్‌పేట బతుకమ్మ వేడుకలకు విచ్చేసిన తెలంగాణ గవర్నర్ దంపతులు

పట్నం పల్లెబాట..

2లో..

3లో..

ఎంవీఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో

విషాదం.

బతుకమ్మ వేడుకల్లో కూలిన లైటింగ్ వ్యవస్థ ఘటనలో ఇద్దరు విద్యార్థులు మృతి.. 20 మందికి పైగా తీవ్ర గాయాలు ఒకరి పరిస్థితి విషమం.. మరొకరు కోమాలోకి.. గాయపడిన పలువురు విద్యార్థులను కామినేని ఆసుపత్రికి తరలింపు స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి బాధ్యుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వేగుచుక్క

పట్నం పల్లెబాట..

(మొదటిపేజీ తరువాయి)

ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి కూడా బస్సులు నడుస్తున్నాయి. స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు మహాలక్ష్మి ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. హైదరాబాద్- విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామయ్యింది. దీంతో చౌటుప్పల్ వద్ద హైవే-65 పై వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. భారీ ట్రాఫిక్ నేపథ్యంలో పోలీసులు వాహనాలను దారిమళ్లించారు. చౌటుప్పల్ ఆర్డీఓ ఆఫీస్ నుంచి మార్కండేయ నగర్, వలిగొండ, తాళ్లసింగారం, లింగోజిగూడెం, అంకిరెడ్డిగూడెం పంతంగి మీదుగా వాహనాల మళ్లింపు చేపడుతున్నారు. దానికి తోడు చౌటుప్పల్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నత్త నడకన సాగుతుండటంతో నిత్యం ట్రాఫిక్ జామ్ జరుగుతుందని వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గాపూజ మండపంలో తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. కోల్‌కతా తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. దుర్గామాత మండపం తొక్కిసలాటలో 17 మంది మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. కోల్‌కతా తొక్కిసలాట ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనపై బెంగాల్ సీఎం సువేందు అధికారితో మాట్లాడారు. ఈ ఘటన నేపథ్యంలో ఆదివారం బెంగాల్‌లో జరగాల్సిన అమిత్ షా పర్యటన వాయిదా పడింది. క్షతగాత్రులను పరామర్శించేందుకు ఆయన ఆసుపత్రికి వెళ్లనున్నారు.

315 మండలాల్లో కరువు

(మొదటిపేజీ తరువాయి)

పైపుల వ్యవస్థగా మార్చాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ విధానంతో సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల వరకు తగ్గుతుందని వెల్లడించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన మంత్రి తుమ్మల.. పలు అంశాలను వివరించారు. దుమ్ముగూడెం ఆనకట్టపై దాదాపు రూ.30 లక్షల వ్యయంతో మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తే సుమారు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే అవకాశం ఉందన్నారు. అలాగే ఖమ్మం నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు నిధులు విడుదల చేయాలని కోరారు. కల్లూరిగూడెం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో పాటు వెలుగుమట్ల హౌసింగ్ మోడల్ కాలనీని ప్రారంభించేందుకు డిసెంబరు 9న ఖమ్మం రావాలని ఆహ్వానించారు. మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ మంత్రి తుమ్మల ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా తోలెం కల్యాణి, వైస్ చైర్మన్‌గా కాకా రాములును నియమించారు.

ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్‌లైన్లు మార్చాలి

దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వకు చర్యలు తీసుకోవాలి

సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల వినతి

హైదరాబాద్, అక్టోబర్ 17: ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు లైన్లను కవర్డ్ కండక్టర్లుగా మార్చేందుకు రాష్ట్రస్థాయిలో ఉమ్మడి విధానం రూపొందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం తుమ్మల.. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి.. పలు అంశాలపై వినతిపత్రాలను అందజేశారు. "రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులతో పాటు కొత్తగా సాగుచేయాలనుకునే వారికి విద్యుత్తు లైన్లు సమస్యగా మారాయి. చెట్లు ఎత్తుగా పెరిగిన తర్వాత కొమ్మలు విద్యుత్తు తీగలను తాకడం వల్ల ప్రమాదాలు తలెత్తుతున్నాయి. ఆయిల్‌పామ్ తోటల పరిధిలో 11 కేవీ బేర్ కండక్టర్ల స్థానంలో కవర్డ్ కండక్టర్లు ఏర్పాటుచేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. సీతారామ ఎత్తిపోతలలో సాధ్యమైన చోట్ల పైపుల ద్వారా నీటిని పంపిణీ చేయడం వల్ల సుమారు 9,767 ఎకరాల భూమి సేకరించాల్సిన అవసరం ఉండదు. తద్వారా అందుకయ్యే వ్యయం సుమారు రూ.2,148 కోట్లు తగ్గుతుంది. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటుచేస్తే సుమారు టీఎంసీ నీటిని నిల్వ చేయవచ్చు' అని తుమ్మల వినతిపత్రం ద్వారా వివరించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

మూడు దశల్లో భూముల రీ సర్వే

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ..'రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాలున్నాయి. హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేశాం. నక్షా పటాలు లేని వాటితో కలిపి మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే చేపడుతున్నాం. ఇప్పటికే 285 గ్రామాల్లో పూర్తయింది. నవంబరు నెలాఖరుకు ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం. వేగంగా, పారదర్శకంగా సర్వే పూర్తి చేసేందుకు ఆధునిక యంత్రాలు, సాంకేతికతను వినియోగిస్తున్నాం. ఇప్పటికే 411 రోవర్ల సర్వే జరుగుతోంది. 400 కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ వివాదాలు లేని రాష్ట్ర నిర్మాణం కోసమే సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టాం. డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సర్వేలో వినియోగించి భూములకు కచ్చితమైన హద్దులు గుర్తిస్తాం. ఆ సమాచారాన్ని భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తాం. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలం కొంగరలోని మొత్తం 665 ఎకరాల్లో రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశాం. త్వరలో భూధార్ పట్టాలు పంపిణీ చేస్తాం. నిబంధనలననుసరించి అధికారులు

రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలి. గ్రామాల్లో సర్వేకు ముందు పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులివ్వాలి. భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. సర్వేకు ముందు ఆ యా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు వేయించాలి. ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలి. సర్వే పూర్తయిన గ్రామాల్లో అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించాలి' అని మంత్రి ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూశాఖ కార్య దర్శి లోకేశ్‌కుమార్, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

తెలంగాణపై భారీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

తొలుత పోలవరం-బనకచర్లను తెరమీదికి తీసుకొచ్చారు. దాన్ని అడ్డుకుంటే నల్లమలసాగర్‌గా పేరు మార్చారు. ఇప్పుడు కేంద్రాన్ని ఒప్పించి గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జునసాగర్, సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్లాన్ చేశారు. గోదావరి-కావేరి అనుసంధానానికి మేము వ్యతిరేకం కాదు. తెలంగాణ హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలపైనే మా అభ్యంతరం. సమ్మక్కసాగర్ నుంచి నాగార్జునసాగర్ మీదుగా తీసుకెళ్తే తెలంగాణ ప్రాంతానికి నీళ్లు వస్తాయి. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా నదుల అనుసంధానం జరపడానికి కేంద్రం గతంలోనే ఒప్పుకొంది. సరిహద్దు రాష్ట్రాలు కూడా అంగీకరించాయి. ఈ నదుల అనుసంధానం చేయాలనుకుంటే ముందుగా తెలంగాణకు రావాల్సిన నీటి వాటా 968 టీఎంసీలకు అనుమతివ్వాలి. తీసుకుపోయే నీళ్లలోనూ 50% ఇవ్వాలి. కానీ, ఏపీ ప్రభుత్వం ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరానికి మార్చాలంటోంది. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా వెళ్తే తెలంగాణలో 2,38,236 ఎకరాలకు నీళ్లు పారతాయి. కొత్త ప్రతిపాదనతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఏపీ సీఎం లేఖ రాసి పది రోజులవుతున్నా తెలంగాణ సీఎం ఎందుకు మౌనం వహిస్తున్నారు? రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా ఎందుకు దీనిపై స్పందించడంలేదు? తెలంగాణ నీటి వనరులకు నష్టం వాటిల్లితే కేసీఆర్

నాయకత్వంలో మరో జలపోరాటానికి శ్రీకారం చుడతాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్లో పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పలువురు పోలీసు ఉద్యోగ అభ్యర్థులు, నిరుద్యోగ యువత శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. "రాష్ట్రంలో 25 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగ యువతను వంచించడమే. తాజా కానిస్టేబుల్ నోటిఫికేషన్లో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులు ఒక్కటి కూడా కేటాయించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా పోలీసు పోస్టుల సంఖ్యను పెంచాలి" అని హరీశ్‌రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఇంటర్నెట్.. పిల్లల ప్రాథమిక హక్కు

(మొదటిపేజీ తరువాయి)

వయస్సుతో సంబంధం లేకుండా అవే హక్కులను అనుభవిస్తారని వ్యాఖ్యానించింది. పిల్లలకు హక్కులను పూర్తిగా నిరాకరించడం అనేది అసంబద్ధం అని స్పష్టంచేసింది. ఆన్‌లైన్‌లో పిల్లలకు ఎదురయ్యే సైబర్ బెదిరింపులు, అశ్లీల కంటెంట్, ఇతర హానికరమైన అంశాలను సాకుగా చూపి ఇంటర్నెట్‌ను పూర్తిగా నిరాకరించడం ఏమాత్రం తగదని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ఇంటర్నెట్‌కు దూరంగా ఉంచడం వల్ల పిల్లలు ఆధునిక విద్యా విధానాలకు, ప్రపంచస్థాయి సమాచారానికి దూరం అవుతారని పేర్కొంది. ఇంటర్నెట్ ద్వారా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి పటిష్టమైన నియంత్రణ వ్యవస్థలను తీసుకురావాలి తప్ప సాంకేతికతను వినియోగించుకునే హక్కును కాలరాయకూడదని సూచించింది. ముప్పు ఉందనే భయంతో జ్ఞానాన్ని దూరం చేయడం రాజ్యాంగ విరుద్ధమని వెల్లడించింది. కరోనా తదనంతర పరిస్థితుల్లో విద్యావ్యవస్థ ఆన్‌లైన్ వైపు మళ్లిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. ఆన్‌లైన్ తరగతులు, అసైన్‌మెంట్లు, ప్రాజెక్టుల కోసం విద్యార్థులు ఇంటర్నెట్‌పైనే ఆధారపడుతున్నారని తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్నెట్ నిరాకరణ పిల్లల విద్యాభివృద్ధిని, వ్యక్తిగత ఎదుగుదలను అడ్డుకోవడమే అవుతుందని స్పష్టం చేసింది. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగంగా ఇంటర్నెట్ వినియోగం ప్రాథమిక హక్కు కిందికే వస్తుందని, ఇది చిన్నారులకూ సమానంగా వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో తెలియజేసింది. ఈ మేరకు 137 పేజీల ఉత్తర్వు జారీ చేసింది. డిజిటల్ సాధికారత సాధించే క్రమంలో చిన్నారుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యమని నొక్కిచెప్పింది.

పర్యావరణ హితమే బతుకమ్మ సందేశం

రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ మహిళలు తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు... ప్రజలకు పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని ఇస్తాయని గవర్నర్ శివప్రతాప్ శుక్లా గుర్తుచేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, ఇది మనందరి బాధ్యతన్నారు. శనివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు.. తన సతీమణితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందాయి. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంతోనూ ఈ వేడుకలకు అవినాభావ సంబంధం ఉంది. తీరొక్క పూలతో చేసే బతుకమ్మలు... ప్రకృతి తల్లి ప్రేమకు, తెలంగాణ సంస్కృతికి, మహిళాశక్తికి, వారి ఐక్యతకు ప్రతిరూపాలు" అని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... "పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అంతా ఒకచోట చేరి

నిర్వహించే పూల పండగే బతుకమ్మ. బతుకమ్మ పాటలతో అనాదిగా మహిళలంతా సామాజిక దురాచారాలను దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, భాజపా నేతలు గౌతంరావు, ప్రేంసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో 72 అడుగుల ఎత్తుతో రూపొందించిన బతుకమ్మకు యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, దేవి కలెక్టివ్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ నీలిమ సంబంధిత ధ్రువపత్రాన్ని అందుకున్నారు.

ఎమ్మెల్సీ స్థానాల్లో భాజపా గెలవాలి: రామచందర్‌రావు

హైదరాబాద్: త్వరలో ఎన్నికలు జరగనున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకునేందుకు భాజపా శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. గతంలో నల్గొండ-వరంగల్-ఖమ్మం, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానాలను భాజపా గెలుచుకున్న చరిత్ర ఉందని, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో గెలుచుకోవాలన్నారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఓటింగ్ నమోదుపై సమావేశం ఏర్పాటు చేశారు. భాజపా శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్యతోపాటు మరికొందరు కీలక నేతలతో కలిసి రామచందర్‌రావు మాట్లాడారు. 'ఎమ్మెల్సీ అభ్యర్థులను అధిష్ఠానం త్వరలో నిర్ణయిస్తుంది. ఈ రెండు ఎమ్మెల్సీల స్థానాలను గెలిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం మరింత సులువవుతుందన్నారు.

ఎక్కువ మంది పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు.



ఆన్‌లైన్ బెట్టింగ్ కేసు.. మూడు రాష్ట్రాల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాల కార్యకలాపాలపై దర్యాప్తులో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈడీ) మూడు రాష్ట్రాల్లో నిర్వహించిన సోదాల్లో కీలక సమాచారం సేకరించింది. ముంబయి, పుణె, మెహసానా, సూరత్, హైదరాబాద్‌ల్లోని 20 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ సందర్భంగా నిందితులకు సంబంధించిన నేరారోపణ పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర భౌతిక సాక్ష్యాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. నిందితుల ఖాతాలను స్తంభింపజేయాలని ఆయా బ్యాంకులకు లేఖలు రాసింది. ఆల్‌ప్యానెల్ ఎక్స్ఛేంజ్, ఎంజీఎం 91 అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫాంలకు సంబంధించిన రెండు ప్రధాన నేరాల ఆధారంగా ఈడీ గతంలోనే ఈ దర్యాప్తు ప్రారంభించింది. ఈ ప్లాట్‌ఫాంల ద్వారా బాధితులను డబ్బు డిపాజిట్ చేసేలా ప్రేరేపించడంతోపాటు.. అలా సేకరించిన నిధులను పుణెకు చెందిన రామ్ యు.రామ్‌ధాని అనే వ్యాపారికి చెందిన కంపెనీ ఖాతాకు చేర్చినట్లు దర్యాప్తు క్రమంలో ఈడీ గుర్తించింది. ఎడ్సమ్ 'ఐపైసా' అనే అంతర్గత చెల్లింపుల మధ్యవర్తి వేదిక ద్వారా ఈ మోసానికి పాల్పడినట్లు వెల్లడైంది. దీనిద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్‌మోసాల నిర్వాహకులతోపాటు వారి ఏజెంట్ల తరఫున దాదాపు 200కుపైగా బినామీ సంస్థలను చేర్చుకున్నట్లు తేలింది. మోసాల సొమ్మును మ్యూల్‌ఖాతాల నెట్‌వర్క్ ద్వారా మళ్లించే విషయంలో దుబాయ్‌కు చెందిన వ్యక్తులు ఆదేశాలిస్తున్నట్లు వెల్లడైంది. ఈ సొమ్మును పలు పద్ధతుల్లో విదేశాలకు తరలించినట్లు గుర్తించింది. ఈ కేసులో ఈడీ ఇంతకుముందే పుణె, ముంబయి, బెంగళూరుల్లో పలుచోట్ల సోదాలు నిర్వహించి రామ్ యు.రామ్‌ధానిని అరెస్ట్ చేసింది. ప్రస్తుతం అతడు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నాడు.

సామరస్యపూర్వక సమాజ నిర్మాణంలో..

“ఉపాధ్యాయుల పాత్ర కీలకం.”

- వివిధ సంస్థల ప్రతినిధుల వెల్లడి.

ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్, పీస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ‘ఎడ్యుకేషన్ ఫర్ పీస్’ అనే అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతం.

వేగుచుక్క న్యూస్,హైదరాబాద్:

సామాజిక సామరస్యం, శాంతి, సమానత్వం, న్యాయం, అహింస, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను విద్యార్థుల్లో పెంపొందించి, శాంతియుత సమాజ నిర్మాణానికి పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే శాంతి, పరస్పర గౌరవం, భిన్నత్వాన్ని అంగీకరించడం, సహజీవనం వంటి విలువలను నేర్పించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్, బెంగళూరు మరియు పీస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఉన్న ఆర్నాల్డ్ భవన్ శిక్షణా కేంద్రంలో అక్టోబర్ 15, 16, 17 తేదీలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది. ‘ఎడ్యుకేషన్ ఫర్ పీస్ -- శాంతి విద్య, సామాజిక సామరస్యం’ అనే ప్రధాన అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శాంతియుత సమాజ నిర్మాణానికి మరియు శాంతిని బోధించటానికి విద్య ఎంతోఅవసరం అని

ఈ శిక్షణా కార్యక్రమంలో ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు డా. డెంజిల్ ఫెర్నాండెజ్, జాన్ శామ్యూల్, డా. సత్యం తలారి (స్టేట్ కోఆర్డినేటర్, తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్), పీస్ నెట్‌వర్క్ ప్రతినిధులు డా. మజర్ హుస్సేన్, మహ్మద్ ఖలీం మరియు శైలేంద్ర బోర తదితరులు పాల్గొని వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పాఠశాలలు కేవలం విద్యాబోధనకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామిక దృక్పథం, పరస్పర గౌరవం పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని సూచించారు. కులం, మతం, భాష, ప్రాంతం, లింగం వంటి భిన్నత్వాల పట్ల గౌరవభావాన్ని పెంపొందించడం ద్వారా వివక్ష, అసహనం, ద్వేషం, హింస వంటి సమస్యలను తగ్గించవచ్చని వివరించారు.

పిల్లలు చిన్నతనం నుంచే ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, విభేదాలను శాంతియుతంగా ఎదుర్కోవడం నేర్చుకోవాలని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించడంలో ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం--16పై అవగాహన

ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం--16 అయిన శాంతి, న్యాయం, బలమైన సంస్థలు అనే అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. సమాజంలో శాంతి, న్యాయం, సమానత్వం, జవాబుదారీతనం, ప్రజాస్వామిక విలువలను బలోపేతం చేయడంలో విద్యాసంస్థల పాత్రను వివరించారు.భారత రాజ్యాంగంలోని సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక విలువలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, వాటిని దైనందిన జీవితంలో ఆచరించేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల్లో రాజ్యాంగ స్పృహ, మానవ హక్కుల పట్ల గౌరవం, ఇతరుల పట్ల సానుభూతి, సామాజిక బాధ్యతను పెంపొందించడం ద్వారా ప్రజాస్వామిక సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని తెలిపారు.

ప్రతి పాఠశాలలో పీస్ క్లబ్స్ ఏర్పాటు చేయాలి.

పాఠశాలల్లో శాంతి, విద్యను మరింత ప్రభావవంతంగా అమలు చేయడానికి ప్రతి పాఠశాలలో ‘పీస్ క్లబ్స్’ (శాంతి సంఘాలు) ఏర్పాటు చేయాలని వక్తలు సూచించారు. ఈ క్లబ్స్ ద్వారా విద్యార్థులకు శాంతి, సామాజిక సామరస్యం, అహింస, సహనం, సహకారం, నాయకత్వ లక్షణాలు, సంఘర్షణల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించవచ్చని వివరించారు. పీస్ క్లబ్స్ ఆధ్వర్యంలో చర్చలు, సమూహ కార్యక్రమాలు, సృజనాత్మక పోటీలు, శాంతి సందేశ ప్రచారాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో శాంతియుత దృక్పథాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల మధ్య తలెత్తే విభేదాలను పరస్పర చర్చలు, అవగాహన, సహకారం ద్వారా పరిష్కరించుకునే వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పించాలని సూచించారు.

వివిధ అంశాలపై సమగ్ర శిక్షణ.

ఈ మూడు రోజుల శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.

సామాజిక సామరస్యం -- పరిచయం, సామాజిక అంశాలపై వివిధ దృక్పథాలు, దిశలను అర్థం చేసుకోవడం, సంఘర్షణలు మరియు సామాజిక సామరస్యం,

పిల్లలకు కౌన్సెలింగ్ చేసే పద్ధతులు, శాంతి కార్యక్రమాలు మరియు సామాజిక సందర్భం పాఠశాలల్లో పీస్ క్లబ్స్ ఏర్పాటు, నిర్వహణ

ఈ అంశాలపై చర్చలు, పరస్పర అనుభవాల పంచుకోవడం, ఆచరణాత్మక సూచనల ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. పాఠశాల స్థాయిలో శాంతి విద్యను ఎలా అమలు చేయాలి, విద్యార్థుల్లో సహనం మరియు సహజీవన భావనలను ఎలా పెంపొందించాలి, సంఘర్షణలను ఎలా గుర్తించి పరిష్కరించాలి అనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మూడు రోజుల శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, అనుభవాలను ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో అమలు చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ పాల్గొన్న ధ్రువపత్రాలు అందజేశారు.

మహాలక్ష్మి రూపంలో వారాహీ మాత దివ్యదర్శనం.

వారాహీ క్షేత్రంలో వైభవంగా ఏడో రోజు నవరాత్రి ఉత్సవాలు.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

నగరంలోని అమ్మవెంచర్‌లోని వారాహీ క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తి సందడి నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకుడు పశుపతినాథ్ శర్మ ఏలేటి, అర్చకుడు మహేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ, మంగళహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మహాలక్ష్మి స్వరూపంలో కొలువుదీరిన వారాహీ మాతను దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా క్షేత్రంలో ప్రతిరోజూ అభిషేకాలు, విశేష పూజలు, వారాహీ మూలమంత్ర హవనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుటుంబ సమేతంగా తరలివస్తున్న భక్తులు పూజలు, పల్లకి సేవల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పిస్తున్నారు.దేవాలయ కమిటీ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్త మాట్లాడుతూ

, ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 7:30 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు

అష్టోత్తర పూజలు, పల్లకి సేవ, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వారాహీ మాత కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

ఎంవీస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో విషాదం..

హైదరాబాద్ : మహేశ్వరం నియోజకవర్గం లో ని నాదర్‌గుల్‌లోని ఎంవీస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాల వేళ ఘోర విషాదం చోటుచేసుకుంది. ఎంతో ఉత్సాహంగా, కోలాహలంగా జరుపుకోవాల్సిన పండుగ వేడుకలు విద్యార్థులపాలిట శాపంగా మారాయి. వేడుకల కోసం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ లైటింగ్, సౌండ్ సిస్టమ్స్ ఒక్కసారిగా కుప్పకూలడంతో పెను ప్రమాదం సంభవించింది. కళాశాలలో విద్యార్థులు ఎంతో ఆనందంగా బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న సమయంలో.. అకస్మాత్తుగా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ స్ట్రక్చర్ మరియు సౌండ్ సిస్టమ్స్ ఒక్కసారిగా విద్యార్థులపై పడిపోయాయి. ఈ ఊహించని ప్రమాదంతో అక్కడున్న విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు.దీంతో అక్కడ ఏం జరుగుతుందో ఎవరికి అర్థం కాలేదు.?ఈ దుర్ఘటనలో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా ?సుమారు 20 మంది వరకు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి.

?క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండగా, మరో విద్యార్థి కోమాలోకి వెళ్ళినట్లు వైద్యవర్గాలు వెల్లడించినట్లు తెలుస్తోంది.? గాయపడిన విద్యార్థులను కామినేని తో పాటు స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

పువ్వులను పూజించడం

“తెలంగాణ గొప్ప సంస్కృతి.”

- పోలీసు సుటుంబం సభ్యుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు.

- హాజరైన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిజామాబాదు, ఆర్మూర్, బోధన్ డివిజన్ పోలీసు సిబ్బంది, పోలీస్ కార్యాలయం సిబ్బంది , రేంజ్ కార్యాలయం సిబ్బంది , హోమ్ గార్డ్స్ సిబ్బంది మరియు అలైడ్ బ్రాంచ్ ల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా దుర్గామాత పూజాకార్యక్రమము అనంతరం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ, పోలీసు వారి కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడడం ఇంత మంది కుటుంబ సభ్యులను కలిసినందుకు వారితో బతుకమ్మ సంబరాల్లో పాల్గొనందుకు ఆనందంగా ఉందని తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతికి చారిత్రక చిహ్నం బతుకమ్మని మరియు తెలంగాణ సాంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎ.సి.పి ప్రకాష్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్ , సిఐలు , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు , ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో కన్నులపండువగా బతుకమ్మ సంబరాలు!

హైదరాబాద్.

?తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను అంబర్‌పేటలో అట్టహాసంగా నిర్వహించారు.

?కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా ఈ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, రికార్డు స్థాయిలో ఏకంగా 72 అడుగుల భారీ బతుకమ్మను పేర్చి నిర్వాహకులు సరికొత్త చరిత్ర సృష్టించారు.ఈ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పిల్లాపాపలతో, మహిళలు, పెద్దలు అనే తేడా లేకుండా వేలాదిగా తరలివచ్చిన జనసందోహం.. బతుకమ్మ ఆటపాటలతో అంబర్‌పేట ప్రాంతాన్ని పులకింపజేశారు. రంగురంగుల పూల సువాసనలు, సాంస్కృతిక కోలాహలం మధ్య తెలంగాణ సంస్కృతి ఉట్టిపడింది.బతుకమ్మ వేడుకలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి గారి ప్రసంగంలోని ..తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ.. ప్రకృతితో మమేకమై.. ఆటపాటలతో సంబురాలు జరుపుకుంటున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి ఈ పండుగను మనం మాత్రమే నిర్వహించుకుంటున్నాం. గ్రామగ్రామాల్లో ఈ వేడుకలను కనుల పండువగా జరుపుకుంటున్నాం. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. మహిళలంతా కలిసి ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ. పూలను పేర్చి అందరూ కలిసి సామూహికంగా ఆడే సామాజిక పండుగే బతుకమ్మ. మిగతా పండుగలుగా కాకుండా ధనిక, పేద, కులాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఒక్క చోట చేరి బతుకమ్మ పండుగను ఆడుకుంటాం.

వేగుచుక్క

విద్యార్థులు, మహిళలపై పోలీసుల వేధింపులు: రాహుల్ గాంధీ

- ఢిల్లీ పోలీసుల తీరుపై తీవ్ర ఆరోపణలు
- మహిళా నిరసనకారులపై లైంగిక వేధింపులు జరిగాయని విమర్శ
- బాధ్యులపై చర్యలకు ఆధారాలు సేకరించాలని సూచన
- కేరళ, రాజస్థాన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:

ప్రజాస్వామ్యం కోసం నిరసన తెలిపిన విద్యార్థులు, మహిళలపై ఢిల్లీ పోలీసులు దాడులు చేయడంతోపాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజల గొంతుకను అణచివేసి, ప్రశ్నించేవారిని భయపెట్టేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారాన్ని కోల్పోతామనే భయంతోనే యువత, మహిళలపై హింసకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఇటీవలి నిరసనల్లో పోలీసుల వేధింపులకు గురయ్యామని ఆరోపించిన మహిళలతో రాహుల్ మాట్లాడిన వీడియోను కూడా పంచుకున్నారు. తమపై జరిగిన దాడులు, వేధింపులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరగా, ఫొటోలు, వీడియోలు వంటి ఆధారాలను అందించాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దాడుల అంశాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. బాధితుల ఫిర్యాదులను ఢిల్లీ పోలీసులు స్వీకరించలేదని ఆరోపిస్తూ, కేరళ, రాజస్థాన్‌లలో ఢిల్లీ పోలీసులపై జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించినట్లు తెలిపారు. బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

మహిళలతో వివాహేతర సంబంధాలు..

- ఆర్మీ మేజర్‌కు షోకాజ్ నోటీసులు
- సైనిక అధికారుల భార్యలతోనూ సంబంధాలున్నాయంటూ ఆరోపణలు
- సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ కోరిన ఆర్మీ చీఫ్
- కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలకు సిద్ధమైన సైన్యం
- చర్యలను నిలిపివేయాలన్న మేజర్ అభ్యర్థనను తిరస్కరించిన ట్రిబ్యునల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:

నలుగురు మహిళలతో వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్మీ మేజర్‌పై భారత సైన్యం చర్యలకు సిద్ధమైంది. ఆయనను సర్వీసు నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని ఆర్మీ చీఫ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 11 ఆర్మర్డ్ రెజిమెంట్‌కు చెందిన ఈ అధికారి ప్రస్తుతం 23 గ్రెనేడియర్స్‌కు అనుబంధంగా ఉన్నట్లు సంబంధిత పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్ట్ మార్షల్ ద్వారా విచారణ చేపట్టడానికి బదులుగా ఆర్మీ రూల్స్ 14, 19 కింద పరిపాలనా చర్యలు ఎందుకు తీసుకోకూడదో అధికారులు వివరణ కోరారు.

భార్య ఫిర్యాదుతో మొదలైన విచారణ

మేజర్ భార్య 2023 ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్మీ ప్రధాన కార్యాలయ డిసిప్లిన్ అండ్ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు సాయుధ దళాల ట్రిబ్యునల్ (ఏఎఫ్‌టీ)లో దాఖలైన పిటిషన్ వెల్లడించింది. వివాహేతర సంబంధాలతోపాటు డ్రగ్స్ వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నట్లు తెలిపింది. ఈ ఫిర్యాదుపై 2023 అక్టోబర్‌లో 55 (I) మెకనైజ్డ్ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయం కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీని ఏర్పాటు చేసింది.

అయితే, విచారణలో ఆర్మీ రూల్ 180 ప్రకారం పాటించాల్సిన నిబంధనలను ఉల్లంఘించారని మేజర్ ఆరోపించారు. ఫిర్యాదులో ప్రస్తావించిన మహిళలు, వారి భర్తలను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. తన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకోవడంతోపాటు నివాసంలో నిర్వహించిన సోదాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు.

కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలు

2025 మార్చిలో ఆర్మీ చట్టంలోని 45, 63 సెక్షన్ల కింద ప్రాథమిక అభియోగ పత్రాన్ని రూపొందించి, సాక్ష్యాల నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ దశలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళలను కూడా విచారించాలని మేజర్ కోరినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం కోర్ట్ మార్షల్‌కు బదులుగా పరిపాలనా చర్యలు చేపట్టాలని సైన్యం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన ఏఎఫ్‌టీని ఆశ్రయించారు.

తన భార్య ఫిర్యాదును ఉపసంహరించుకున్నందున, గత విచారణ ఆధారంగా తీసుకుంటున్న చర్యలు చట్టవిరుద్ధమని మేజర్ వాదించారు. 2026లో తామిద్దరం పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నామని, రాజీ ఒప్పందంలో భాగంగా భార్య ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారని పిటిషన్‌లో వివరించారు. తగిన ఆధారాలు లేకుండానే కుటుంబ వివాదాల నేపథ్యంలో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారని మేజర్ తెలిపారు.

అయితే, అక్టోబర్ 14న పిటిషన్‌ను విచారించిన ఏఎఫ్‌టీ ప్రిన్సిపల్ బెంచ్.. మేజర్‌పై కొనసాగుతున్న పరిపాలనా చర్యలను నిలిపివేసేందుకు నిరాకరించింది. దీంతో ఆయనపై సైన్యం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

న్యాయం కోసం ధైర్యంగా నిలబడండి: సీజేఐ సూర్యకాంత్

- రాజ్యాంగ విలువలు, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలి
- న్యాయవాదులు నిజాయతీగా, బాధ్యతాయుతంగా పనిచేయాలి
- న్యాయవిద్యార్థులకు దేశం ఆశాకిరణాలుగా చూడాలి

బెంగళూరు, అక్టోబర్ 17:

న్యాయవిద్య పూర్తి చేసుకుని వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై దేశం ఎన్నో ఆశలు పెట్టుకుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ అన్నారు. న్యాయం కోసం ధైర్యంగా నిలబడాలని, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడుతూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని సూచించారు. శనివారం బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ 34వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. న్యాయవిద్య అంటే చట్టాలను నేర్చుకోవడమే కాదని, విభిన్న అభిప్రాయాలను అర్థం చేసుకుంటూ సమాజానికి సేవ చేయడం కూడా అందులో భాగమని పేర్కొన్నారు. వృత్తిలో సౌలభ్యం కోసం సూత్రాలను పక్కన పెట్టకూడదని, అన్యాయానికి గురైన వారికి అండగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. న్యాయవాదులు తమ వృత్తి బాధ్యతలతోపాటు దేశానికి, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎల్ఎల్‌బీ పట్టా అందుకోకముందే మరణించిన ఊర్వశి కృష్ణత్రాకు సీజేఐ నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సంతాపం తెలిపారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, అధ్యాపకుల పాత్ర కీలకమని గుర్తుచేశారు. న్యాయవాదులుగానే కాకుండా ప్రజల్లో ఆశలు నింపే వ్యక్తులుగా ఎదగాలని సూచించారు.

ఓవైసీని చూసి నేర్చుకోండి.. విపక్షాలకు కిరెన్ రిజిజు హితవు

- జాతీయ ప్రయోజనాల విషయంలో ఓవైసీ వైఖరిపై కేంద్రమంత్రి ప్రశంసలు
- భారత వ్యతిరేక ముఠా ఎవరో ఇప్పుడు అర్థమైందంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్య
- మోదీపై ఎలాన్ మస్క్ విమర్శలను తప్పుబట్టిన ఎంఐఎం అధినేత



న్యూఢిల్లీ, అక్టోబర్ 17:

ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు ప్రశంసలు కురిపించారు. ముస్లిం కేంద్రంగా సాగే రాజకీయ విధానాలను ఓవైసీ అనుసరిస్తున్నప్పటికీ, దేశ జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన హేతుబద్ధంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలు ఆయన వైఖరి నుంచి నేర్చుకోవాలని సూచించారు. 'భారత వ్యతిరేక ముఠా ఎవరో ఇప్పుడు అర్థమైంది' అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రిజిజు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.

ఎలాన్ మస్క్ వ్యాఖ్యలతో వివాదం

ఇటీవల భారత్‌లో స్టార్‌లింక్ అనుమతుల అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేసినట్లు కథనం పేర్కొంది. భారతదేశానికి నిజమైన ప్రధాని ముఖేశ్ అంబానీ అంటూ ఆయన ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో దుమారం రేపాయి. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. 'ఎలాన్.. భారతదేశానికి స్వాగతం. ఆ రెండో వ్యక్తి గురించి తెలిసే వరకు ఆగు' అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ ఈ వ్యాఖ్యల ద్వారా పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని పరోక్షంగా ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది.

విదేశీ వ్యాపారవేత్తల జోక్యంపై ఓవైసీ అభ్యంతరం

మస్క్ వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ విధానాలను వ్యతిరేకించడం వేరు, భారతదేశ అంతర్గత వ్యవహారాలు, నిర్ణయాలపై విదేశీ వ్యాపారవేత్తలు వ్యాఖ్యలు చేయడాన్ని సమర్థించడం వేరని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. మస్క్‌కు మోదీపై రాజకీయ వ్యతిరేకత ఉండవచ్చని, అయితే ఆ కారణంతో భారత ప్రధానిపై విదేశీ పారిశ్రామికవేత్తలు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని అంగీకరించకూడదని ఓవైసీ స్పష్టం చేశారు. ఈ అంశంలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలనే కిరెన్ రిజిజు ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

తెలంగాణ పంచాయతీ మాసపత్రిక ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 17:

పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి, గ్రామీణ పాలనలో పారదర్శకత, ఉద్యోగుల సంక్షేమం లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ పంచాయతీ మాసపత్రికను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ పత్రిక ద్వారా ప్రతి నెలా పంచాయతీరాజ్ శాఖలో జరిగే కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామీణాభివృద్ధి పనులు, ఉద్యోగుల సమస్యలు, విజయాలు, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందించనున్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నూతన ఆలోచనలు, సూచనలకు కూడా ప్రాధాన్యం కల్పించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండ్ తెలంగాణ పంచాయతీ మాసపత్రిక ఎడిటర్ అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ల్యాప్‌టాప్‌లు/టాబ్‌లు అందించాలని మంత్రి సీతక్కను కోరారు. వీటి ద్వారా డిజిటల్ సేవల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ట్రిబ్యునల్ మెంబర్ నాగులూరి కృష్ణ కుమార్, అంబటి శ్రీనివాస్, టీజీఐఆర్‌డీ సెంటర్ హెడ్ సుభాష్‌చంద్ర గౌడ్, డిప్యూటీ సీఈవో వెంకన్న, డీఎల్పీవో సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల లైంగిక దోపిడీ కంటెంట్‌పై సుప్రీంకోర్టు కఠిన ఆదేశాలు

- పేవాల్ వెనుక ఉన్నా నిషేధిత కంటెంట్‌ను అనుమతించొద్దు
- ఉల్లంఘనలకు భారీ జరిమానాలు, అక్రమ ఆదాయం స్వాధీనం చేసుకునేలా చర్యలు
- హానికర కంటెంట్ గుర్తింపు, తొలగింపునకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలు
- పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం పరిష్కారం కాదన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17:

పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సోషల్ మీడియా సంస్థలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పేవాల్ లేదా సబ్‌స్క్రిప్షన్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇలాంటి కంటెంట్‌ను అందించడం, అప్‌లోడ్ చేయడం, ప్రచారం చేయడం, ప్రసారం చేయడాన్ని అడ్డుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 15న ఈ ఆదేశాలు జారీ చేసింది. 2024లో ఇచ్చిన ఆదేశాల అమలులో తగిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది.

*** భారీ జరిమానాలకు ప్రతిపాదనలు**

సమాచార సాంకేతిక చట్ట నిబంధనలను ఉల్లంఘించే సోషల్ మీడియా మధ్యవర్తులపై భారీ జరిమానాలు విధించే వ్యవస్థను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఉల్లంఘన తీవ్రత, వ్యవధి, పునరావృతం, సంస్థ వార్షిక టర్నోవర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. నిషేధిత కంటెంట్ ద్వారా సంపాదించిన ఆదాయాన్ని స్వాధీనం చేసుకునే విధానాన్ని కూడా పరిశీలించాలని ఆదేశించింది.

ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలు

పిల్లల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు పర్‌సెప్చువల్ హాష్ మ్యాచింగ్, యూఆర్ఎల్ జాబితాల వంటి సాంకేతిక పద్ధతులను వినియోగించాలని ధర్మాసనం సూచించింది. ఈ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకునేందుకు జాతీయ స్థాయి హాష్, యూఆర్ఎల్ డేటాబేస్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 15, ఐటీ చట్టంలోని సెక్షన్ 67బీ వంటి నిబంధనలను తప్పించుకునేలా ప్లాట్‌ఫామ్‌లు వ్యవహరించకూడదని స్పష్టం చేసింది.

అభిజీత్ దీప్కే, నేహా బోరా విడుదల

- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఇంకా తిహార్ జైలులోనే
- ఢిల్లీలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన సభ
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్తో ఉద్యమం మరింత ఉధృతం
- సీఈసీ తొలగింపునకు డీఎంకే తీర్మానం

ఢిల్లీ, అక్టోబర్ 17:

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిలిపివేత డిమాండ్లతో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనల్లో శనివారం మూడు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను ఢిల్లీ ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ షరతులతో షరతులతో విడుదల చేశారు. అఖిల భారత విద్యార్థి సంఘం (ఐసా) అధ్యక్షురాలు నేహాబోరా పోలీసుల నిర్బంధం నుంచి విడుదలయ్యారు. మరోవైపు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్లీలా మైదాన్ లో భారీ నిరసన సభ నిర్వహించేందుకు కాంగ్రెస్కు పోలీసులు నిరభ్యంతర పత్రం జారీ చేశారు.

ఏడాదిపాటు శాంతిభద్రతల పూచీకత్తుపై దీప్కే విడుదల

ఈనెల 16న కన్నాట్ ప్లేస్ లో జాతీయ పతాకాలతో నిర్వహించతలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' ప్రదర్శనకు వెళ్లకుండా అభిజీత్ దీప్కేను పోలీసులు నిర్బంధించిన విషయం తెలిసిందే. ఆయనను మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్లోని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట శనివారం హాజరుపరిచారు. భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్లు 126, 170 కింద నిరోధక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం ఏడాదిపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోనని పూచీకత్తు సమర్పించే షరతుతో దీప్కే విడుదలకు అనుమతించారు. 10న మొదటిసారి నిర్బంధానికి గురైనప్పుడు కూడా ఆయన రూ.50 వేల పూచీకత్తు సమర్పించారు. ఆరు రోజుల వ్యవధిలో మరోసారి నిర్బంధానికి గురై కొత్త పూచీకత్తు సమర్పించాల్సి రావడం గమనార్హం. సీజేపీ న్యాయ విభాగం అధిపతి రత్నా సింగ్ ఈ నిర్బంధం చట్టబద్ధతను ప్రశ్నించారు.

నేహా బోరా విడుదల

ఈనెల 16న మండీ హౌస్ ప్రాంతంలో నిర్బంధానికి గురైన నేహా బోరాను శనివారం తెల్లవారుజామున విడుదల చేశారు. ఢిల్లీ పోలీసు చట్టంలోని సెక్షన్ 65 ప్రకారం అవస రమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. విడుదల అనంతరం నేహా బోరా పోలీసుల తీరును తీవ్రంగా విమర్శించారు. తనను నిర్బంధించిన తర్వాత న్యాయవాదులను కలుసుకునేందుకు గంటల తరబడి అనుమతించలేదని ఆరోపించారు. న్యాయవాదులు ఐదారు గంటలపాటు తనను సంప్రదించేందుకు ప్రయత్నించారన్నారు. సాధారణ పౌరులు తమ వోటు హక్కును పరిరక్షించాలని కోరుతున్నారని, వారిని నేరస్థులుగా పరిగణించడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, జ్ఞానేశ్ కుమార్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిరసనల సందర్భంగా నిర్బంధానికి గురైన ఇతర కార్యకర్తలను కూడా విడుదల చేయాలని కోరారు.

సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఇంకా తిహార్ జైలులోనే

దీప్కే, నేహా బోరా విడుదలైనప్పటికీ సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా జ్యుడిషియల్ కస్టడీ కొనసాగుతోంది. అక్టోబర్ 13న జంతర్మంతర్ లోకి ప్రవేశించి జాతీయ పతాకాన్ని ప్రదర్శించిన ఘటనకు సంబంధించి ఈనెల 14న వారిని ఐదు రోజుల కస్టడీకి పంపారు. సౌరవ్ దాస్ ను జైలు నంబర్ 2లోని మూడో వార్డులో, అశుతోష్ రాంకా ను జైలు నంబర్ 4లోని పదిహేనో వార్డులో ఉంచినట్లు జైలు వర్గాలు తెలిపాయి. వారి కదలికలను సీసీటీవీ ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

1న రామ్ లీలా మైదాన్ లో కాంగ్రెస్ భారీ సభ

శనివారం నాటి మరో ముఖ్యమైన పరిణామం కాంగ్రెస్ ప్రతిపా దిత భారీ సభకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వడం. ఢిల్లీ సెంట్రల్ డీసీపీ రోహిత్ రాబీర్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం నవంబర్ 1న రామ్లీలా మైదాన్లో సభ నిర్వహించేందుకు కాంగ్రెస్కు ఎన్వోసీ జారీ చేశారు. అంతకుముందు మైదానం అందుబాటులో ఉన్న తేదీలపై ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ను కాంగ్రెస్ సంప్రదించింది. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు మైదానం అందుబాటులో ఉంటుందని మున్సిపల్ అధికారులు ధ్రువీకరించారు.

జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలి: డీఎంకే తీర్మానం

తమిళనాడులో మరో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ఎం.కె. స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో డీఎంకే పార్లమెంటరీ పార్టీ నాలుగు తీర్మానా లను ఆమోదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఆయన వ్యవహారశైలిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

బెంగళూరు, ముంబయిలో కొనసాగుతున్న నిరసనలు

ఈనెల 16న ఢిల్లీతోపాటు బెంగళూరు, ముంబయి, పాట్నాలో కూడా సీజేపీ అనుకూల నిరసనలు జరిగాయి. బెంగళూరులో జాతీయ పతాకా లతో ప్రదర్శన నిర్వహించారు. ముంబయి, పాట్నాలో చిన్నస్థాయి కార్యక్రమాలు జరిగాయి.